# (అ) ద్వితీయం

"నాన్నా! నాకు కొత్తపుస్తకాలు కావాలి" అన్నాడు ఏడో క్లాసు లోకి వచ్చిన శంకర్ ఏడుపు మొహం పెట్టి.

"ఎందుకోయ్ దండుగ! అన్నయ్య పుస్తకాలు వున్నాయిగా! అవి ఏడు ఈ యేడు వచ్చే ఏడు చూద్దాంలే" అన్నాడు శివరావు.

"ప్రతి యేడు యిల్లాగే అంటున్నావు" అన్నాడు శంకర్

"ఫో, అవతలకి ఫో వెధవా! అసలే స్ట్రైక్‌లో రెండు నెలల జీతం పోయి నేనేడుస్తుంటే, నీ గొడవేమిటి మధ్య?" విసురుగా లేచాడు శివరావు.

నెమ్మదిగా తల్లి దగ్గర చేరాడు శంకర్, "ఏమిటమ్మా! ప్రతి ఏడాది నాకీ పాత పుస్తకాలేనా? కొత్తపుస్తకాలు కొనరా ఎప్పుడూ ఇంక?' ప్రశ్నించాడు జాలిగా.

తల్లి వాణ్ణి దగ్గరికి తీసుకుని, "చూడు నాన్నా, అన్నయ్య లాస్ట్ ఇయర్ సెవెన్త్ చదివాడు, వాడి పుస్తకాలు బాగానే వున్నాయి గదా! ఈ యేడాది అవి నీకు పనికొస్తాయి. మళ్ళీ అవే పుస్తకాలు కొని డబ్బు వేస్ట్ చేయడం ఎందుకు? ఆ డబ్బు వేరే యింకేపనికైనా ఉపయోగించుకోవచ్చు కదా?" అని బుజ్జగించి చెప్పింది.

శంకర్ మౌనంగా వెళ్ళిపోయాడు. కాని వాడి మనస్సు అంతా బాధ పడుతూనే ఉంది. ఎప్పుడూ తనకన్నీ పాతవే. అన్నయ్య ఆడుకున్న బొమ్మలే తను ఆడుకున్నాడు. అన్నయ్య వేసుకున్న బట్టలే తను వేసుకున్నాడు. కొత్త పండుగ వచ్చినా తనకి కొత్త బట్టలు వుండవు. అన్నయ్యేమో రోజు రోజుకి పర్వతంలా ఎదిగిపోతున్నాడు. అవన్నీ

తనకే కట్ట పెట్టేస్తున్నాడు. ప్రతి యేడాది క్లాసులో అందరూ చక్కగా కొత్త పుస్తకాలు కొనుక్కోవడం, మంచి మంచి బట్టలు వేసుకోవడం, పేర్లు వ్రాయించుకోవడం. తనకేమో అన్నయ్య పేరున్న పుస్తకాలే అన్నీ! చివరికి స్కూల్లో తనకి 'సెకెండ్ హాండ్ శంకర్' అని పేరు కూడా పెట్టేశారు.

అయ్యో! అనకూడదు గాని, ఈ అన్నయ్య లేకపోయినా బాగుండును. అప్పుడు నాకన్నీ చక్కగా కొత్తవే కొంటారు. అని కూడా అనుకోకపోలేదు శంకర్ (బహు సుకుమార స్వభావులైన పసిపిల్లల మనస్సుల లోపలి పొరల లోతులలోని, చెప్పరాని ఒక మహా రహస్యాన్ని బట్టబయలు చేసినందుకు, గత వర్తమాన ఆగామి పర్వకాలములలోని పిల్లలు నన్ను శాశ్వతంగా క్షమింతురు గాక!)



ఎలాగో అలాగ, ఆ పుస్తకాలతోటే ఆ ఏడాది కూడా నెట్టేశాడు శంకర్. శలవల్లో తల్లిదండ్రులతో కలిసి వసంత్, శంకర్, చిన్న మేనమామ పెళ్ళికి వెళ్ళారు. పెళ్ళిలో హడావిడి అంతా వసంత్‌దే. శంకర్ ఎవరితో మాట్లాడకుండా మూగిలా, ఎప్పుడూ ఓ మూల కూర్చునేవాడు. మళ్ళీ స్కూళ్ళు తెరిస్తే, మళ్ళీ తనకి పాత పుస్తకాలే గతి అన్నది వాడి మనస్సులో దిగులు అని తండ్రి గమనించలేదు గాని, తల్లి గమనించింది.

"శంకర్‌కి మాటలు రావు, శంకర్‌కి మాటలు రావు" అని పెద్ద మేనమామ కూతురు, ఐదో క్లాసు చదువుతున్న సత్యభామ శంకర్‌ని ఏడిపించ సాగింది. సత్యభామ తండ్రి మాటల్లో అందుకుని, వసంత్‌తో "ఏరా? గడుగ్గాయ్! మా అమ్మాయిని చేసుకుంటావా?" అని అడిగాడు. "అదెప్పుడూ నాకోడలే" అని భార్య అంటుండగా శివరావు అందుకున్నాడు. "ఊరికే అంటే చాలదు. కట్నం బోలెడంత ఇవ్వాల్సి ఉంటుంది.'నే చచ్చినా యివ్వను' అని నవ్వసాగాడు సత్యభామ తండ్రి.

"ఎవరు ఏమైనా ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు" అమాంతం పెద్ద గొంతుతో అందుకున్నాడు శంకర్ అంతా ఆశ్చర్యపోయారు. ఈ మూన్నాళ్ళలో వాడు మాట్లాడిన మొదటి మాట అది. "ఏరా! ఎందుకు వీల్లేదు? " అడిగింది తల్లి.

"నాకది నచ్చలేదు" సమాధానం

"నీక్కాదోయ్ ముండా! అన్నయ్యకిస్తారు దాన్ని" అన్నాడు శివరావు నవ్వుతూ

"అందుకే వీల్లేదంటున్నది. వాడు చేసుకున్న ఏడాదికి నా మొహానే కొడతారుగా దాన్ని" అంటూ అక్కడి నుండి లేచి వెళ్ళిపోయాడు శంకర్.

తరువాతేం జరిగిందో తెలియదు కాని, ఆ యేడాది నుంచీ శంకర్‌కి కూడా కొత్తపుస్తకాలు, కొత్తబట్టలు కొనసాగాడు శివరావు..